# అపూర్వ సంఘటన ×

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

జీవితంలో ఆ నాటికీ-ఈ నాటికీ-ఏ నాటికీ మరువలేని సంఘటన అది. అల్లాంటి అపూర్వ సంఘటన ఏ జీవికైనా జన్మలో ఒకే ఒక్కసారి సంభవిస్తుంది. దాన్ని అల్లాగే మననం చేసుకొంటూ, మర్చిపోదామన్నా మరువలేక, పైకి చెప్పివేద్దామన్నా విప్పిచెప్పలేక, అది ఏనాటికీ హృదయంనుంచి చెరిగిపోకుండా శాశ్వత ముద్ర వేసుకునే వుంటుంది. అటువంటి సంఘటన ఏకాలంలోనైనా, ఏదేశంలోనైనా ఎవరికైనా జరిగితే జరగవచ్చు. అదికాదని కొట్టిపారెయ్యడం కూడా సమంజసం కాదనుకొంటూ. అందుకే అమాట ఎప్పటికైనా బయట పెట్టా అని నామనస్సు ఆరాట పడ్తూనే వుంటుంది. ఆవిషయం స్మరణకు వచ్చినప్పుడల్లా నాలో నేను కుమిలిపోతూ, జీవితంలో ఎన్నో రహస్యాలు బయట పెట్టకూడనివి వుంటాయని దుఃఖిస్తూనే వుంటా.

ఆనాడు కృష్ణపక్షంలో ఏకాదశి. ఝాము రాత్రి దాటింది. నా భార్య పురిటికి పుట్టింటికి వెళ్ళడం, అక్కడ ఆమె ప్రసవించి మగపిల్లవాడు కలగడం, వానికి బారసాల మహోత్సవం చేసుకు కృష్ణాష్టమినాడు పుట్టినబిడ్డ కాబట్టి వేణుగోపాలుడని పేరు పెట్టుకోవడం పూర్తయింది. ఇంక నా భార్యనీ బిడ్డనీ నా యింటికి తీసుకురావాలనుకొంటూండగా హఠాత్తుగానూ అత్తవారింటిదగ్గరనుంచి నాభార్య బిడ్డ కూడా చాలా ప్రమాద స్థితిలో వున్నట్లు టెలిగ్రాం - అదిచూడగానే అప్పటికి చీకటి పడ్తోన్నా లెక్కచెయ్యకుండా బయల్దేరా నా యినప గుఱ్ఱంమీద. మా అత్తవారి ఊరు వెళ్ళడానికి పదిమైళ్లు ఓ చిట్టడివిలాంటిది దాటాలి. రాత్రి సమయంలో ఆ త్రోవన బళ్లు బస్సులు ఏమీ వెళ్ళవు. అయినా సాహసించి నా ప్రాణాల్ని కూడా లెక్కచెయ్యకుండా బయల్దేరా. చేతిలో టార్చిలైటు, నా సైకిలు మాత్రం నాకు సహాయం.

కన్ను పొడుచుకున్నా కనిపించని గాఢాంధకారం. ఆ కటికచీకటిలోనే ఆ చిట్టడవిలో సగందాకా సైకిలు త్రొక్కుకు వచ్చేశా. సరిగ్గా పెద్దమర్రి దొంగల మర్రి దగ్గరకి వచ్చేసరికి తపీమని సైకిలు టైర్ పేలిపోయింది. అంతే సైకిలు ఆగి క్రిందపడిపోయా. అంతా అయోమయం-అంధకారం-చుట్టూ అడవి-ఎటు వెళ్ళాలన్నా అయిదుమైళ్లు దాటాలి-భయంతో నా ప్రాణం బిక్కుబిక్కుమంటోంది. ఒక్కసారిగా నా నరాలన్నీ స్తంభించిపోయాయి. కీచురాళ్ళధ్వనులు, ఆకాశానికి ఎగప్రాకినట్లున్నా చెట్లనీ చూచేసరికి నా గుండెలు దడదడలాడాయి.

సైకిలును వదిలేద్దామంటే మనస్కరించలేదు. ఈదురోమంటూ చలిగాలి కివ్వున వేస్తోన్నా లెక్కచెయ్యకుండా అల్లాగే ఆ ఇనప గుఱ్ఱాన్ని లాక్కుపోతూ మెల్లిగా నడక ప్రారంభించా. ఆకాశాన్న నక్షత్రాలున్నాయి కాని అవి నాకు మార్గం చూపించలేకపోతున్నాయి. చేతిలో టార్చిలైటు కాస్తా నేను సైకిలుమీద నుంచి క్రిందపడ్డంలో ముక్కలైంది దాని అద్దం. అల్లాగే మైలుదూరం దాన్ని ఈడ్చుకొంటూ నడవగలిగాను గాని ఇంక అదీ నాకు అసాధ్యమైనపనే అయిపోయింది. అసలు ఆ అడవిలో ఎలుగుగొడ్లు, చిరతపులులు, జంతువుల ప్రమాదాలు చాలాసార్లు జరిగాయని చెప్పుకోవడం వినికిడి. ఒకవేళ అట్టి ప్రమాదానికి గురికాకుండా బ్రతికి బయట పడ్డాగాని, ఆ అడవిలో దొంగల ముఠా నుంచి బ్రతికి బయటపడ్డవాళ్లు చాలా అరుదు. ఏదో ఒక క్రూరమృగంవచ్చి నన్ను బలితీసుకోకుండా నా ప్రాణాలైనా దక్కించుకోవాలనే ఆశతో, ఆ సైకిలు చూస్తే దొంగలు నన్నుకూడా వదలరనే భయంతో ఆ ఇనపగుఱ్ఱాన్ని ఓ చెట్టుకు జేర్లాబెట్టి గ్రుడ్డిగా కన్పించే టార్చిలైటునిమాత్రం సహాయంగా తీసుకు నడక సాగించాను. కడుపులో ఆకలి దహించుకు పోతోంది. మనస్సులో గత జీవితానుభవం గుర్తుకువచ్చి భార్యని కొడుకుని తల్చుకొనేసరికి గుండెలు టకటకలాడ్తూ గుభేలుమంటున్నాయి.

నా భార్యకి ముప్పయి అయిదు సంవత్సరాలు దాటాక ఎన్నో నోముల ఫలితంగా, అనేక వ్రతాల ప్రభావంవల్ల మాకు లేకలేక ఒక్కడే మగపిల్లవాడు కల్గడం,......వానిని చూచి నేనూ నా భార్య పొందిన ఆనందం అంతా ఇంతా...పిల్లవానికి మూడో నెలలో పిడుగువంటి వార్తలూ భార్యకీ బిడ్డకీ కూడా జబ్బుగా

THE KARUR KNITTING COMPANY, KARUR
TEMPLE BRAND

చిరకాల మన్నికకూ. రకానికీ...
అత్యుత్తమమైన
== గోపురం మార్కు ==
బనియన్లనే ఉపయోగించండి.
—: తయారుచేసేవారు :—
కరూర్ నిట్టింగ్ కంపెని
239. జవహర్ వీధి : : కరూర్ (S. I.)

వుందని తెలియడం, ఈ అర్ధరాత్రిసమయంలో, ఈ నిర్జన ప్రదేశంలో నేను ఏ జంతువుకైనా బలి అయి పోతే?...అక్కడ నా భార్యాబిడ్డలు...ఇంక ఈ నాటితో నా సంసారం సాఫ్ అయిపోతోందని విలపించాను.

అల్లాగే కాళ్లు తడబడుతూ, మనస్సు మథనపడ్తూ, హృదయం ఆవేదనతో కొట్టుకుపోతూ, ఎల్లాగో అడుగులు వేస్తున్నాను. అసలే భయంతో కంపించిపోయే నాకు ఏ మూలనుంచో ఓ జంతువు అరుపు విన్పించింది. ఇంక ఆ ధ్వని నా చెవులకి విన్పించేసరికి ఉన్న ధైర్యం కాస్తా ఉడిగిపోయి, నా ప్రాణంమీది ఆశతో మరో వైపుకి పరుగు తీశాను. ఇంక వెనక్కి ప్రక్కకి తిరిగి చూడకుండా అల్లా ఆ కారడవిలో ఎంతదూరం నడిచిపోయానో నాకే తెలీకపోయినా చెట్లమాటునుంచి చంద్రోదయం అవుతూన్నట్లు కన్పించింది. గాఢాంధకారం కొంచెం తగ్గి చిరు వెలుతురు చెట్ల నీడలు కల్సి కొంచెం కాంతి కల్గించాయి -నా మనస్సుకి. వెన్నెలను చీల్చుకొంటూ నీడలు ఆక్రమించుకొంటూన్నా అల్లాగే ముందుకి నడక సాగించాను.

కొంతదూరం పోయేసరికి భూర్ణగర్భిణీలాగ ప్రవర్తిస్తూ నిశ్చలంగా పారుతూన్న ఏరు కన్పించింది. గబగబా అక్కడికి వెళ్ళి ఓరాతిమీద నిల్చుని పురిషెడు నీళ్లు పుక్కిలించి, ముఖ ప్రక్షాళణం చేసుకొంటూంటే నాకు పదిగజాల దూరంలో ఓ మానవాకారం కదుల్తూన్నట్లయింది. ఆ అడవిలో అసలు మానవ మాత్రులెవ్వరూ ఇంకా రాత్రి వుండగా తిరుగుతారని నాకు నమ్మకం లేదు. అయినా ధైర్యం వహించి అటు చూచేసరికి శరీరమంతా నల్లటి ముసుగుతో గబగబా నడిచిపోతోంది. వెన్నెట్లో ఆ ఆకారాన్ని పరికించి చూచేసరికి అదివరకెన్నడూ దయ్యాలంటే నాకు నమ్మకం లేకపోయినా; ఆ సమయంలో ఆ స్వరూపంమాత్రం దెయ్యమేనని నమ్మిక చిక్కింది నా మనస్సుకి. ఇంక నామనస్సు భయంతో గుండె ఆదటు గడియార శబ్దంలా టక్ టక్ మంటూ నాకే విన్పించింది.

టార్చిలైటు వేసిచూచా, కాని అప్పటికే ఆ మానవాకారం ఏ చెట్టుచాటుకో మాయమయింది. భయంతో నా కాళ్లు గజగజా వణికిపోతూంటే రెండడుగులు పైకి వచ్చా. అంతలో కేర్ కేర్ మంటూ పసిబిడ్డ ఏడ్పు వినిపించింది. ఆ చంటిబిడ్డ రోదన ఆ నిర్జన ప్రదేశంలో ఎటునుంచి వస్తోందోకూడా గుర్తించలేక ఆశ్చర్యంగా చూస్తూ నిల్చున్నా-ఆ బిడ్డ కక్కటిల్లి ఏడుస్తోంటే ఆ ధ్వని సరిగ్గా నీటి సమీపం నుంచి వస్తూన్నట్లు విన్పించేసరికి గబగబా ముందుకు నడిచిచూచా, సరిగ్గా నీళ్ళకి అడుగుదూరంలో కటికి మట్టిమీద ఓ పసిబిడ్డ-నిర్ఘాంతపోయా...కొన్ని క్షణాలు నేను అల్లా చూస్తూ నిల్చుండగానే ఆ బిడ్డ దొర్లి నీళ్ళలోకి దిగజారబోయేసరికి గభీలున పట్టుకొన్నా - చందమామ వెలుగులో ఆ బిడ్డని చూచా-మగపిల్లవాడు-ఆ బాలుని ముఖం నన్నుచూచి

నవ్వుతూన్నట్లుంది. కెవ్వుకెవ్వున ఏడ్చే ఆ బిడ్డను నేను చేతుల్లో ఎత్తుకొనేసరికి ఆ ఏడ్పుమాని కేరింతాలుకొడ్తూ అమాయకంగా నా ముఖంలోకి చూస్తున్నాడు. చేతిలో వున్న టార్చిలైటు వెలుగులో ఆ బాలుని శరీరమంతా పరిశీలించిచూచా. బంగారం కాచి వడబోసి విగ్రహం చేశారా అన్నట్లుంది శరీరచ్ఛాయ. బ్రహ్మ తన చాకచక్యాన్నంతా వినియోగించి ఈ బాలుని విగ్రహం కళ్లు ముక్కు ముఖం తీర్చిదిద్ది తయారుచేశాడా అనిపించింది. అంత అందాల బాలుడు. ఏ కిరాతుకులైనా వస్తువుల కోసం బాలుని అక్కడ పారవేశారనుకొందామన్నా గాని ఆ శిశువు ఈ భూలోకాని కొచ్చాక ఇంకా సూర్యరస్మి చూడలేదని స్పష్టంగా తెలుస్తోంది. పురాణయుగంలో కుంతీదేవివలె ఏ కన్యకామణి అయినా... లేక వితంతు పుత్రుడా?...పోషించలేక వదలబడిన నిరుపేద బాలకుడా?... ఈ బిడ్డని నేనిప్పుడేం చెయ్యాలి? ఈ బిడ్డతోసహా నేను నాభార్య దగ్గరికి వెడ్తే?...అసలే నా భార్యకి అనుమానం...అందులోనూ ఈ బిడ్డని చూస్తే ఇంకేమైనా ఉందా? ... ఉరిపోసుకుంటుంది. నాకు తెల్సు! మరేం చెయ్యాలి? ఈ పిల్లవాణ్ణి తీసుకెళ్ళి జరిగిన సంగతి యదార్థంగా చెప్పి, ఆనాడు సీత లవకుశలను పెంచినట్లుగా ఈనాడు మన బిడ్డతోపాటు అయాచితంగా లభించిన ఈ బిడ్డని కూడా పెంచమంటే?...నా భార్య అందుకు అంగీకరించదు సరికదా; నేనే ఎవరినో...ఆ బిడ్డని నా ముఖాన్ని పారేసి ఆమె ఎవరో లేచి చక్కాపోయిందని, తన అనుమానానికి చిలువలు పలవలు ఏర్పరుచుకు సంసారంలో అశాంతి రేకెత్తించి, అసూయ భరించలేక ఆత్మహత్యకూడా తెగించేరకం నా భార్య-అందుచేతనే ఆ బిడ్డని ఇక్కడే వదిలేసి నా దారిని నేపోతా అనుకొంటూండగానే ఆబిడ్డ కెవ్వుమన్నాడు. ఆ యేడ్పువిని వుల్క్కిపడ్డా - ఎటూ నాకు పాలుపోవడంలేదు - ఈ బిడ్డను వదిలిపోతే ఎట్లా? ఒదిలిపెట్టకుండా వెంటతీసుకుపోతే నా బ్రతుకు ఎట్లా? నా భార్యకి, ఆమె తల్లితండ్రులకీ, నా బావమరుదులకి ఏమని జవాబివ్వాలి?...నిజం చెప్పినా నమ్ముతారా? నాలో నేను ఓగంట గుంజాటనపడి ఎవరైనా వస్తారేమోనని గొంతుక చించుకొని అరిచా-కాని మానవ మాత్రులెవరూ నా మాటల్ని విన్నట్టు కన్పించలేదు-చిట్టచివరకు ఆ బాలుని గట్టుమీదికి తీసుకొచ్చి, నా చొక్కా అడుగునవున్న బనియనువిప్పి నేలమీదపరిచి దానిపై ఆబిడ్డను పడుకోబెట్టాను. కాని వానిని వదిలిపెట్టి వెళ్లాలంటే మాత్రం నాపాదం కదలడంలేదు. బిడ్డ కక్కటిల్లి కేర్ కేర్మని ఏడుస్తూంటే నా నెత్తిమీద పిడుగులు పడ్తూన్నట్లుగా వుంది... ఆ బిడ్డని ఏ నక్కలైనా...ఆ ఆలోచన వచ్చేసరికి నా గుండెలమీద పెద్ద రుబ్బురోలుపెట్టినట్లుగా బరువెక్కిపోయింది. అల్లాగే నిల్చుని ఆబాలుని వైపు చూస్తూంటే నా కళ్ళంట ధారగా నీళ్లు కారిపోతున్నాయి. నేనా బాలుని వదిలేసి వెళ్ళిపోతే ఏంజరుగుతుందో నాకు తెలుసు...అసలాబాలుని ఆ వుద్దేశంతోనే అక్కడ వదిలేసి వుంటారు. ఆ బిడ్డ బహుశా సూర్యుడు అస్తమించాక పుట్టివుండవచ్చు-సూర్యోదయం అయ్యేలోపుగా ఆ బిడ్డని అంతం చెయ్యాలని చేతితో నదిలో పారవెయ్యడానికి మనస్కరించలేదేమో? ఏ జంతువుకో ఆహారంగా పైన వదిలారు. ఇంకా కొంతసేపు నేనే చూడకపోతే ఈ పాటికే నదీగర్భంలో కలిసిపోయేవాడే...అంతలో ఓ పెద్ద కుక్క పరుగెత్తుకువచ్చింది. ఆ బాలుణ్ణికూడా ఓ మాంసం ముద్ద అనుకొందేమో దగ్గరికి వచ్చి ఆ జాగిలం నోట కరుచుకోబోయింది. నా కళ్లు గిరగిరా తిరిగిపోయినట్లయి, భూమి అడుగునుంచి క్రుంగిపోతూన్నట్లనిపించింది. ఆకాశం ఫెళఫెళా విరిగి మీద పడ్తుందనుకొన్నా-నాలో మానవత్వంలేదా? అని ప్రశ్నించినట్లుంది ఆ బాలుని ముఖం-ఇంక జరగబోయే భయంకర భీభత్సం కళ్లకికట్టినట్లు నా మనో నేత్రానికి కన్పించేసరికి ఒక్క అదటున ఆ బాలుణ్ణి చేతుల్లోకి తీసుకున్నా.

ఏం ఆబాలుడుమాత్రం నాబిడ్డవంటి మానవుడుకాడా వానికి కాళ్లు చేతులు కళ్లుముఖం అందరిలాగ లేదా? ఏది ఎల్లా జరిగినా దైవంమీద భారంవదలి ఆ బాలుణ్ణి ఎత్తుకొని తిన్నగా ఆ యేటిగట్టునే నడకసాగించా.

అరుణోదయమయ్యే సూచనలు కన్పించడంతో నాకు పోయినప్రాణం లేచివచ్చినట్లయింది. బాలుణ్ణిమాత్రం జాగ్రత్తగా గుండెలకి అదిమిపట్టుకొని ఓ చిన్న ఊరు కన్పించేవరకూ నడిచిపోయా. అక్కడ అరుగుమీద కూర్చొని దంత ధావనం చేస్తోన్న నామిత్రుడొకడు కన్పించి 'అడేమిటోయ్? ప్రొద్దున్నే బయల్దేరావ్?


ఇప్పుడే ట్రయిన్ దిగావేమిటి? మీ ఫేమిలీకూడా వస్తున్నారేమిటి? ఇల్లారండీ' అంటూ అహ్వానించేసరికి బ్రతుకజీవుడా అనుకొంటూ గుమ్మం ఎక్కా-అంతలో నామిత్రుడు లోపలికివెళ్ళి వానిభార్యనిపిల్చి నా చేతిలో పిల్లవాణ్ణి తీసుక ఆమెకిచ్చాడు.

'మీ శ్రీమతి ఇంకా ఎంతదూరంలో వుందోయ్?' అనడిగాడు.

అందుక ఏమని జవాబివ్వాలోకూడా నాక తట్టలేదు. ఏదయినా అపద్ధర్మం అబద్ధం చెప్పాలనుకొన్నా-'అ ప్రక్క స్టేషన్లో మా ఆవిడ చంటివాణ్ణి నా చేతికిచ్చి క్రిందకి దిగి వెళ్ళిందోయ్! మళ్ళీ ఆమె ఎక్కకుండానే ట్రయిను కదిలింది. ఆమె ఎక్కిందో; లేక ఆ స్టేషన్లో ప్లాట్ ఫారంమీద వుందో ఎటూ తోచక నేనిక్కడ దిగిపోయా-అబ్బాయిని కొంతసేపు మీవాళ్లని చూస్తూండమని నువ్వుచెప్తే, నేను వెళ్ళి ముందుపని చూసుక మా ఆవిణ్ణి తీసుకవస్తా' అంటూ మళ్ళీ వాళ్ళ జవాబుకైనా ఎదురుచూడకుండా గబగబా నడిచి వెళ్ళిపోయా.

మా అత్తవారింటికి వెళ్లేసరికి వారింటిల్లపాదీ ఘొల్లున గోలెత్తిపోతూ గుమ్మంలోనే కన్పించారు. అసలు విషయం అర్థంగాక నిల్చున్న నాతో 'నాయనా! నీ కొడుక్కి మొన్న అష్టమికి మూడోనెల వచ్చిందని మొక్కుబడి చెల్లించడంకోసం చంటివాణ్ణి తల్లినీ తీసుక మా పెద్దబ్బాయి బెజవాడ కనకదుర్గ గుడికి తీసుక వెళ్లాడు. మధ్యలో రైలు ఎక్కడో పట్టాలుతప్పి ఓ పెట్టె...అందులోనే మనవాళ్ళూ వున్నారుట. నిన్న సాయంత్రం టెలిగ్రాం ఇచ్చారు. అప్పుడే నీకూ తెలియజేసాం. అందరం ఇప్పుడు బయల్దేరి వెడ్తున్నాం-' అంటూండగానే మా మామగారి గొంతుక బొంగురుపోయి శోకంతో పూడిపోయింది. అది వినేసరికి పిచ్చివాడిలా పరుగెత్తుతూ 'మీరు వెనకాల రండి. నే

Grams "SHIVAJITEX" Telephone No. 3316



నిప్పుకే త్రొయినుక వెళ్ళిపోతా' అని మాత్రం చెప్పేసి అంతలో ఎవరిదో టాక్సీ వెడ్తూంటే వారిని బ్రతిమాలి ఎల్లాగో అందులో ఎక్కేశా.

నేను వెళ్ళేసరికే దెబ్బలుతగిలిన ప్యాసింజర్లని తీసుక వెళ్ళి రైల్వే డాక్టర్లు చికిత్సచేస్తున్నారు. చనిపోయిన వారిని ఓచోట వుంచారు. తిన్నగా అందరితోపాటు నేనూ శవాలున్నచోటకి వెళ్లా. నా ఏకైక పుత్రుడు నిద్రపోతోన్నట్లు ఓచోట కన్పించాడు. ఆ కళేబరం చూచి, ఇంకా భ్రాంతితీరక భుజాన్ని వేసుక వెర్రివానిలా ఏడుస్తోంటే; నాభార్య ఏమైందో అని...తిన్నగా గాయపడినవాళ్లదగ్గరకి వెళ్లా. అక్కడ ఓమంచంమీద నా భార్య స్పృహలేకుండా తలకి కట్టుకట్టబడి పడుకొనివుంది. దెబ్బ చాలా బలంగా తగిలింది అని చెప్పారు.

మూడవరోజుకి నా భార్యకి తెలివివచ్చి 'అబ్బాయి ఏడీ?' అని అడిగింది. ఆసమయంలో దారుణ వార్త చెబితే అప్పుడే ఆమె ప్రాణం తీస్తా...ఆమెకు ఆబిడ్డ ఎన్నో నోములు, వ్రతాలు చెయ్యగా కల్గిన వరప్రసాది. అల్లాగే ఆలోచిస్తూ నిల్చుండిపోయా.

'అబ్బాయి ఎక్కడున్నాడు?' హీనస్వరంతోనే ఆశగా చూస్తూ అడిగింది నా భార్య.

'వున్నాడు. సుఖంగానే వున్నాడు.' అన్నాను.

'ఇల్లా తీసుకురండి' అంది.

'నువ్వు కొంచెం తేరుకొన్నాక తీసుకొస్తా. ఇప్పుడు కదిలితే మళ్లా ఆ గాయంలోంచి రక్తం వస్తుంది. మాట్లాడక పడుకో' అన్నా.

ఎల్లాగో పక్షంరోజులు మధ్యపెట్టి పిల్లవానిని చూపిస్తానని అంటూనే గడుపుకొచ్చా. కాని ఆరోజున ఆస్పత్రినుంచి ఆమెను తీసుకపోవచ్చునన్నారు. బిడ్డ లేడని తెలిస్తే నాభార్య ప్రాణం వదిలేస్తుంది అని రూఢిగా నాకు తెలుసు. ఆ అనాథ బాలుని గురించి ఆశ చివురించింది నాలో. అన్నింటినీ ధైర్యంగా ఎదుర్కోవాలని నా మిత్రుని ఇంటికి బయల్దేరా. వారింట్లో వారంతా నేను ఏరోజుకారోజే వస్తానని ఎదురుచూస్తూ (నా) బిడ్డకి ఏలోపం రాకుండా చూస్తున్నారు. నేను ఇన్నాళ్ళూ ఆలస్యం చేసినందుకు పెండటి విషయంలో మాత్రం ఓ కట్టుకథ అల్లి చెప్పి ఆబిడ్డని తీసుక తిన్నగా నాభార్య దగ్గరకి వచ్చేశా. నాభార్యతో నిజం చెప్పి ఆబిడ్డకి బదులుగా ఈబిడ్డను చూసుకొందామని అనాలనుకొన్నా-కాని...ఒకవేళ నేనూ నాభార్యకూడా అంగీకరించినా అంతటితో సరిపోతుందా? సంఘమని, ఆచారమని, కట్టుబాట్లని, కులమత భేదాలని గురించి ఎంతో ఆంధోళనపడవల్సివస్తుంది. ఆడవాళ్ల నోట్లో రహస్యం దాగదని—అథవా ఏ ఉత్తమ స్త్రీలలోనైనా దాగినా దాగవచ్చునేమోకాని నాభార్య నోట్లో మాత్రం అరక్షణంకూడా ఆగదు ఏమాట అయినాసరే.

నా చనిపోయిన బిడ్డకీ వీనికీ కొన్ని తేడాలు వున్నాయి. అవి నాభార్య (కన్నతల్లి కాబట్టి) స్పష్టంగా గుర్తిస్తుంది. సాధ్యమైనంతవరకూ అనుమానం కల్గకుండా వుండాలని నా కన్నకొడుకు ఒంటిమీది నగలు, మెడలో పులిగోరు పతకం, మొలలో మామిడిపిందెలు, కాళ్లవి చిరుమువ్వలు, చేతులవి మురుగులు, మురిడీగొలుసులు, వేళ్ళనున్న ఉంగరాలు...ఇల్లాంటి ఆభరణాలన్నీ (దైవమిచ్చిన) ఈబిడ్డకి తగిలించి తిన్నగా నా భార్యదగ్గరకి తీసుకవెళ్లా.

ఆబిడ్డని చూచి ఒక్కసారిగా నాభార్య నిర్ఘాంతపోయింది. 'వీడు నా బాబుకాడు' అని స్పష్టంగా అనేసి ఫిట్ వచ్చినట్లు స్పృహతప్పి పడిపోయింది.

తెలివివచ్చాక ఆబిడ్డ తనబిడ్డ కాడని విలపించింది. ఎన్నో మంచిమాటలు చెప్పి, ఆభరణాలు నిదర్శనం చూపించి, అవసరమైనప్పుడల్లా ప్రమాణాలుకూడా చేసి చెప్తూ (అబద్ధాలకి అర్ధమేమిటి? గుడ్డికంటికి చూపేమిటి?) ఈ పిల్లవాడు మన అబ్బాయేననీ; దెబ్బ బలంగా తగలడంచేత నీకు కొంచెం మతి చంచరించిందనీ నమ్మకం కల్గేలా నేను చెప్పి, నల్గురు డాక్టర్లచేత చెప్పించి, అక్కడవుండేవాళ్ళల్లో కనీసం ఓవందమందిచేతనయినా చెప్పించాక తన చేతుల్లోకి తీసుకొంది ఆ బాలుణ్ణి. ఆ పిల్లవాణ్ణి నాభార్య తీసుకొనేసరికి నాకు తలప్రాణం తోకకి వచ్చినంత పనైంది.

ఆస్పత్రినుంచి తిన్నగా తన పుట్టింటికి వెళ్లాలంది నా భార్య. కాని...నాభార్యతో వచ్చిన ఆమె అన్నగారికి రైలుప్రమాదంలో కాలు విరిగిపోయిందని తీసుకవెళ్ళేటప్పుడుకూడా వాళ్ళకి పుట్టివానిమాట నేను సరిగ్గా చెప్పలేదు. ఆసమయంలో మా అత్తమామలుకూడా తల్లికోసం తాపత్రయపడ్డారుకాని బిడ్డవిషయంలో విశ

రంగా అడిగే స్థితిలోకూడా లేకపోవడంచేత ఇప్పుడు ఎక్కువ ఇబ్బంది రాదని నాకు తెల్సు. కాని బిడ్డ పోలికలు గుర్తించడంలో మా అత్తగారు అసాధ్యురాలు. అందుకే ఆరునెలలవరకూ నా క్రొత్త బిడ్డని ఆవిడ కళ్ల పడకుండా కాపాడాలని మనస్సా నిశ్చయించుకుని నా భార్యకి అనేక విధాల నచ్చచెప్పి తిన్నగా నాయింటికే తీసుకవెళ్లాను.

రెండుమూడునెలలపాటు నా భార్య అప్పుడప్పుడు బిడ్డను గురించి అనుమానంగా అడుగుతూనే వుండేది. కాని నేనుమాత్రం ఎన్నడూ నిజాన్ని బయటపెట్టకుండా 'ఏమిటాభ్రాంతి? కన్నతల్లి తనబిడ్డనిగురించి అనుమానించిందంటే అది లోకవిరుద్ధం' అంటూ ఎన్నో నీతులు చెప్పేవాడిని. ఆ బాలుణ్ణి చూసుకొంటూ ఆరునెలలయ్యేసరికి ఇంక మనస్సులో ఏలాంటి శంకా లేకుండా స్వేచ్ఛగా పాలు ఇస్తూ, అతిగారాబంగా అల్లారు ముద్దుగా పెంచడంతో నా మనస్సు ఆనందంతో ఉప్పొంగి పోయింది.

పిల్లవానికి ఏడాది పూర్తికాకుండా (పోయిన బిడ్డ లెక్కప్రకారం) విజయవాడవెళ్ళి కృష్ణానదిలో స్నానం చేసి దుర్గాదేవి దర్శనం చేసుకు, ఇంకా ఇతర యాత్రలన్నీకూడా పూర్తిచేసుకు చివరకు ద్వారకకూడావెళ్ళి.. శ్రీకృష్ణపరమాత్మ పుట్టిన స్థలాన్ని కూడా దర్శించి... అక్కడే మా ఏకైకపుత్రుడు, ముద్దులబిడ్డకు శ్రీ వేణుగోపాలుడని నామకరణం. శ్రీ కృష్ణపరమాత్మకు అంకితమిచ్చి...బృందావనాది...అనేక పుణ్యప్రదేశాలు దర్శించుకుని మా అత్తవారింటికి వచ్చాం. పుట్టినప్పటికంటే చాలా బాగున్నాడనీ; తల్లి పోలిక, మేనమామ పోలికలు...ఇంకా ఇంకా అందరి పోలికలు మా అబ్బాయిలో అచ్చుగ్రుద్దినట్లు స్పష్టంగా వున్నాయని ఆ ఊరివారంతా అంటోంటే నాలో నాకే నవ్వొచ్చేది. చూడబడే వస్తువులో కంటే చూచేవాళ్ళ దృష్టిలోనే అన్నిరకాల పోలికలు కన్పిస్తాయి కాబోలునని అనుకొంటూ మురిసిపోయేవాణ్ణి.

మా అక్కయ్య అన్నయ్య దృష్టిలో మా అబ్బాయిలో వారివారి పోలికలు, నా పోలికలు స్పష్టంగా కన్పించాయి. పిల్లవాడు కృష్ణాష్టమినాడు పుట్టడం (భ్రాంతి) చేత, వాడు సుఖంగా జీవించివుండడం (నిర్జీవుడైనా) చేత మేనమామకు ఎల్లాగో గండం గడిచినా కాలుమాత్ర విరిగిపోయిందట.

మా అబ్బాయికి జరిగిన వేడుకలు వర్ణించి చెప్పడానికి నాకు సాధ్యంకాదు. అపురూపంగా పుత్రోదయమైన తల్లిదండ్రులకే అవి అర్థంచేసుకు ఊహించుకోగలరనుకొంటూ...ఆ విధంగా అల్లారు ముద్దుగా పెరిగే మా అబ్బాయికి పదోసంవత్సరం వచ్చింది.

సరిగ్గా తెల్లవారితే మా అబ్బాయికి ఉపనయన ముహూర్తం. నాకు శలవు దొరక్కపోవడంచేక చీకటిపడేవరకూ బయల్దేరడానికి అవకాశం చిక్కలేదు. చీకటిపడ్డాక నేనూ మరో ఇద్దరు మిత్రులుకల్సి ఆ చిట్టడవిలో నుంచి మూడు సైకిళ్ళ మీద ప్రయాణం చేస్తోంటే...ఆనాటి సంఘటన అంతా గుర్తుకు వస్తోంది. ఆ అపూర్వ సంఘటనని, ఆ దయ్యాల మర్రిని చూస్తూ, ఆ చిదంబర రహస్యాన్ని నా మనస్సులోనే దాచుకొని (ఆ) అబ్బాయి అదృష్టానికి నాలోనేను ఆనందిస్తూ పరధ్యానంగా సైకిలు త్రొక్కుతోంటే...

'బావా! మీ అబ్బాయికి ఉపనయనం మాయింట్లో చేస్తామంటే నే ఝాము రాత్రికైనా ఊడిపడనివాడవి మా అమ్మాయి పెళ్ళికొడుకుతో తర్లివచ్చేసరికి సుముహూర్తం కాస్తా దాటిపోతుందేమో!' అని పల్కరించే మా భావమరది కంఠస్వరం విని గతానుభవం సంఘటనల్ని వదలి ప్రస్తుతంలోకి వచ్చా.

Telegrams : "UNIGEN" :: Telephone : 21378-21379

For FIRE, MOTOR. MARINE ACCIDENT
FIDELITY GUARANTEE & EMPLOYERS. LIABILITY
INSURANCES

*CONSULT:—*

**United India Fire & General Insurance Co., Ltd.,**

"BOMBAY LIFE BUILDINGS"

**No. 9, BROADWAY :: MADRAS-1.**

*BRANCHES* : **Throughout India & Far East.**